క్లుప్తంగా

రేపు లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో వేలం

సింగరాయకొండ: పాత సింగరాయకొండలోని వరాహ లక్ష్మీనరసింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల సందర్భంగా వివిధ ఐటమ్‌లకు బుధవారం ఉదయం 10 గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఈఓ పి.కృష్ణవేణి, ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ పామర్తి మాధవరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 30వ తేదీ నుంచి జూన్ 9వ తేదీ వరకు బ్రహ్మోత్సవాల సందర్భంగా కొబ్బరికాయల విక్రయం, జెయింట్ వీల్ నిర్వహణ, కొబ్బరి చిప్పలు పోగుచేసుకోవడం, కూల్‌డ్రింక్స్, ఐస్‌క్రీమ్స్ విక్రయ హక్కులకు వేలం నిర్వహించనున్నట్లు వివరించారు. వేలంలో పాల్గొనేవారు దేవదాయ శాఖ నిర్ణయించిన కనీస ధరావత్తు మొత్తాన్ని చెల్లించాలని స్పష్టం చేశారు.

నిండిన చెక్‌డ్యాంలు


మహమ్మదాపురం చెక్‌డ్యాంలో చేరిన వర్షం నీరు

హనుమంతునిపాడు: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని చెక్‌డ్యాంలు నిండాయి. వాగులు, వంకలోకి నీరు చేరింది. ఈ వర్షం సామాజిక వనాలకు, నిమ్మతోటలకు పండ్ల తోటలకు ఎంతోపయోగం ఉంటుంది. చెక్‌డ్యాంకులు, కుంటల్లోకి నీరు చేరడంతో తాగునీటికి ఇబ్బందులు ఉండవని పశుకాపరులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఏటా వేసవిలో మేత, నీటి కోసం జీవాల మేత కోసం అద్దంకి, దర్శి, వినుకొండ, కురిచేడు ప్రాంతాలకు తీసుకువెళ్లేవారు. రెండు రోజులుగా మంచి వర్షాలు కురవడంతో పచ్చిక, నీరు దొరుకుతుందని పశుపోషకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం


సీనియర్ పిరమిడ్ మాస్టర్ సుజాతను సన్మానిస్తున్న సభ్యులు

పామూరు: నిత్యం ధ్యానం చేయడం వ్యక్తికి సంపూర్ణ ఆరోగ్యదాయకమని బెంగుళూరుకు చెందిన సీనియర్ పిరమిడ్ మాస్టర్ సుజాత అన్నారు. స్థానిక పత్రిసాయి జ్ఞానబోధి పిరమిడ్ ధ్యానకేంద్రంలో సోమవారం పందిటి అల్లూరయ్య అధ్యక్షతన ధ్యానం ఆవశ్యకత, ఆత్మజ్ఞానంపై సందేశం నిర్వహించారు. ప్రతి వ్యక్తి నిత్యం వారి వయస్సును బట్టి ధ్యానం చేయడం ఆరోగ్యకరమన్నారు. శాకాహారానికి ప్రాధాన్యతనిచ్చి మాంసాహారానికి దూరంగా ఉండాలన్నారు. అనంతరం ఆమెను పత్రిసాయి పిరమిడ్ ధ్యాన కమిటీ సభ్యులు గుత్తి వెంకట రమణయ్య, నారాయణరెడ్డి, వాణి, పుష్ప, పలువురు ధ్యానపరులు సన్మానించారు.

నారాయణస్వామి ఆదాయం రూ.1.28 లక్షలు

సీఎస్‌పురం(పీసీపల్లి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం నారాయణస్వామి ఆలయానికి ఆదివారం రూ.1,28,987 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి నర్రా నారాయణరెడ్డి తెలిపారు. స్వామి దర్శనం టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.59,950, స్వామి లడ్డూ ప్రసాదం అమ్మకం ద్వారా రూ.21,940, స్వామి ఆలయం వద్ద నిర్వహిస్తున్న శాశ్వత అన్నదాన పథకం నిర్వహణకు దాతలు ఇచ్చిన విరాళాలు రూ 33,465, మహా ప్రాకార నిర్మాణానికి దాతలు ఇచ్చిన విరాళాలు రూ.6,000, ఇతర విరాళాలు రూ.7,632 వచ్చినట్లు చెప్పారు. ఇందులో శాశ్వత అన్నదాన పథకం నిర్వహణకు వెలిగండ్ల మండలం, లక్ష్మక్కపల్లి గ్రామానికి చెందిన గంజి వెంకట సుబ్బారెడ్డి, సుబ్బరత్నమ్మ దంపతులు రూ.10,116 విరాళం ఇచ్చినట్లు పేర్కొన్నారు.

పాకల ఆలయాల భూముల వేలం రద్దు


భూముల వేలం నిర్వహణకు హాజరైన అధికారులు, రైతులు

సింగరాయకొండ: మండలంలోని పాకల పంచాయతీలోని రామలింగేశ్వరస్వామి, వేణుగోపాలస్వామి ఆలయ భూముల కౌలు వేలం రద్దు చేసినట్లు ఈఓ పి.కృష్ణవేణి సోమవారం తెలిపారు. రామలింగేశ్వర స్వామి దేవస్థానానికి 9.50 ఎకరాలు, వేణుగోపాలస్వామి ఆలయానికి 10 ఎకరాల భూములు ఉన్నాయి. గత ఏడాది హక్కులు పొందిన రైతులు తాము పండించిన పంట ఇంకా అమ్ముడుపోలేదని, ఇప్పుడు వేలం ధరావత్తు మొత్తం చెల్లించలేమని, జూన్, జూలైలో వేలం నిర్వహించాలని అధికారులను అభ్యర్థించడంతో తాత్కాలికంగా రద్దు చేశారు. ఎంపీటీసీ ఏపూరి శ్రీనివాసులు, ఏఎస్సై షేక్ మహబూబ్‌బేగ్, రైతులు, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


టంగుటూరులో మాట్లాడుతున్న వరికూటి అశోక్‌బాబు


కనిగిరి మున్సిపల్ ఆఫీసు వద్ద జెండా ఆవిష్కరణ


పామూరు ర్యాలీలో మాట్లాడుతున్న నేతలు

ఎర్ర జెండా రెపరెపలు

కనిగిరి రూరల్: ప్రపంచ కార్మికుల దినోత్సవం మేడే వేడుకలను సోమవారం కనిగిరిలో ఘనంగా నిర్వహించారు. మే డే సందర్భంగా ఏఐటీయూసీ, సీఐటీయూ వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జెండాలను ఎగుర వేశారు. స్థానిక మున్సిపల్ ఆఫీసు, ఆర్‌డబ్ల్యూఎస్, డ్రింకింగ్ వాటర్, పెయింట్ వర్కర్స్, సీలింగ్ వర్కర్స్, ఆర్టీసీ, ప్రవేటు విద్యుత్ ఎలక్ట్రీసీ, హెల్త్ వర్కర్స్ కార్యాలయా వద్ద జరిగిన జెండా ఆవిష్కరణ చేశారు. జి.బాలిరెడ్డి, నాసర్‌ల అధ్యక్షతన జరిగిన సభలో ఏఐటీయూసి జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి సయ్యద్ యాసీన్ మాట్లాడుతూ కార్మికులంతా ఐక్యతగా ఉన్నప్పుడే హక్కుల సాధన సాధ్యమవుతుందన్నారు. సీపీఐ రాష్ట్ర నాయకులు వై రవీంద్రబాబు, బ్యంగి సుబ్రహ్మణ్యం, డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు పందిటి మోహన్ తదితరులు పాల్గొన్నారు. తొలుత ఏఐటీయూసి, అనుబంధ సంఘాల కార్మికులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. మదర్‌థెరిస్సా సేవా సమితి సభ్యులు కోటిరెడ్డి, హుస్సేన్ బాషాల సౌజన్యంతో ఏర్పాటు చేసిన అల్పాహార విందును కార్యక్రమాన్ని గౌరవాధ్యక్షులు ఎస్‌డీ యాసీన్ ప్రారంభించారు. సీఐటీయూ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో డిపో సెంటర్, పామూరు బస్టాండ్, నాజ్ సెంటర్‌లలో జెండా ఆవిష్కరించారు. సీఐటీయూ జిల్లా నాయకులు జీవీ కొండారెడ్డి, పీసీ కేశవరావు పాల్గొని మాట్లాడారు.

హనుమంతునిపాడు: మండలంలో మే డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘ ఉపాధ్యక్షుడు బడుగు వెంకటేశ్వర్లు, కార్మిక సంఘాల సభ్యులు కత్తి ఏబు, మండల కార్మిక సంఘ నాయకులు నాగూర్, రాము, గురునాథం, గురవయ్య, వెంకటేశ్వర్లు, కత్తి అబ్రహ్మ, కొండయ్య, మార్కు పాల్గొన్నారు.

పామూరు: శ్రామిక, కర్షక జీవుల పండుగైన మేడే వేడుకలను ఏఐటీయూసి, సీఐటీయూ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో స్థానిక గుజ్జుల యల్లమందారెడ్డి భవన్‌తో పాటు కందుకూరు రోడ్డులో నిర్వహించగా కార్మిక సంఘాల జెండాను సంఘం జిల్లా నాయకుడు సయ్యద్ మౌలాలి, వజ్రాల సుబ్బారావు, పాలపర్తి మస్తాన్‌రావులు ఆవిష్కరించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో సీపీఎం పశ్చిమ ప్రకాశం జిల్లా కార్యదర్శి, సీఐటీయూ జిల్లా నాయకులు సయ్యద్ హనీఫ్ ఆవిష్కరించారు.

సీఎస్‌పురం(పీసీపల్లి): కార్మికులు ఎన్నో త్యాగాలు చేసి సాధించుకున్న చట్టాలను బీజేపీ ప్రభుత్వం కాలరాస్తుందని సీఐటీయూ నాయకుడు ఎస్ తిరుపతిరెడ్డి అన్నారు. మేడేను పురస్కరించుకొని సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ సెంటర్‌లో జెండాను ఆవిష్కరించారు. సీపీఐ మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ సెంటర్‌లో సీఐటీయూ జెండాను ఎం వెంకట కొండయ్య ఆవిష్కరించారు.

సింగరాయకొండ: స్థానిక కూరగాయల మార్కెట్ సెంటర్, కొండపి వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద సోమవారం ఐఎఫ్‌టీయూ, సీఐటీయూ ఆధ్వర్యంలో మే డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి ఆర్.మోహన్ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్మికుల చట్టాలను కేంద్ర ప్రభుత్వం కాలరాసిందని దుయ్యబట్టారు. అనంతరం కార్మికుల జెండాను ఆవిష్కరించారు. అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి కె.నాంచార్లు, ఎస్‌కే బాబు, రమణయ్య, అంజయ్య, బాబూరావు పాల్గొన్నారు.

వెలిగండ్ల: శ్రామికులంతా ఏకమై తమ హక్కుల కోసం పోరాటాలకు సిద్ధంగా ఉండాలని జిల్లా సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు రాయల్ల మాలకొండయ్య అన్నారు. మేడేను పురస్కరించుకొని జెండా ఆవిష్కరించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు టి.నాని, ఇండియన్ గ్యాస్ యాజమాన్యం పత్తిపాటి యానాథరావు, సీఐటీయూ నాయకులు కె.ఎస్తేరమ్మ, ప్రకాశం, రత్తమ్మ, రమాదేవి, పంతగాని నారాయణ, కె. నాగేశ్వరి, రాంప్రసాద్, రాయల్ల భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణ తగదు

కొండపి: ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించడాన్ని ప్రజలు వ్యతిరేకించాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకుడు వైవీ కృష్ణారావు పిలుపునిచ్చారు. మే డే సందర్భంగా మండల కేంద్రంలో సీపీఐఎంఎల్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ అనంతరం ఆయన మాట్లాడారు. కార్మికుల హక్కులు కాలరాసే నాలుగు లేబర్ కోడ్ చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. హక్కుల కోసం కార్మికులు ఐక్యపోరాటానికి సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు ఎస్.నాగరాజు, పీఓడబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు ఎస్.భారతి, సహాయ కార్యదర్శి వై.సుశీల, ఐఎఫ్‌టీయూ నాయకులు డి.రాజు, బి.శేషయ్య, బుజ్జి, మాణిక్యరావు, వెంకటేశ్వర్లు, పీడీఎస్‌యూ నాయకులు సిద్ధయ్య, అచ్యుత్, వీరేంద్ర తదితరులు పాల్గొన్నారు. అలాగే సీఐటీయూ ఆధ్వర్యంలో మేడే కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో కేజీ మస్తాన్, వందనం తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కుల పరిరక్షణకు కృషి

సీఎస్‌పురం(పీసీపల్లి): కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం న్యాయస్థానాలు పని చేస్తున్నాయని సీఎస్‌పురం సచివాలయ పంచాయతీ కార్యదర్శి రాంప్రసాద్ అన్నారు. మేడేను పురస్కరించుకొని స్థానిక స్త్రీ భక్తి భవనంలో కనిగిరి మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. చట్టప్రకారం కార్మికులకు సంక్రమించిన హక్కుల పరిరక్షణ కోసం న్యాయ స్థానాలు నిరంతరం పనిచేస్తున్నట్లు తెలిపారు. ఎస్‌బీసీసీ కో ఆర్డినేటర్ కిరణ్‌కుమార్, పారాలీగల్ వలంటీర్ రమేష్‌బాబు, న్యాయ సేవాధికార సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మే డే వేడుకలు

టంగుటూరు: స్థానిక బొమ్మల సెంటర్లో మే డే వేడుకల్లో వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు పాల్గొన్నారు. కార్మికులకు మేడే శుభాకాంక్షలు తెలిపారు. టంగుటూరులో సీఐటీయూ ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు, రిక్షా పుల్లర్లు, మెకానికల్ వర్కర్లు ఎర్ర జెండా ఎగుర వేశారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ నర్రా జగదీష్, సీఐటీయూ మోజెస్, జిల్లా కార్యదర్శి టి.రాము, టి.వెంకట్రావు, శ్రీను, యానాది తదితరులు పాల్గొన్నారు.


ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికుల ర్యాలీ


కొండపిలో జెండా ఎగురవేస్తున్న సీపీఐఎంఎల్ నాయకులు కృష్ణారావు, నాగరాజు తదితరులు


హెచ్‌ఎంపాడులో మేడే వేడుకలు


సీఎస్‌పురంలో సీఐటీయూను జెండా ఆవిష్కరణ


వెలిగండ్లలో జెండా ఆవిష్కరిస్తున్న నేతలు



సింగరాయకొండ : మే డే వేడుకలో పాల్గొన్న కార్మిక సంఘాల నాయకులు

ప్రకృతి సేద్యం లాభదాయకం

టంగుటూరు: తక్కువ ఖర్చుతో నాణ్యమైన పంట దిగుబడి సాధించేందుకు రైతులను సమాయత్తపరచడమే పొలం బడి ఉద్దేశమని ప్రకృతి వ్యవసాయాధికారులు ఎంటీ పద్మావతి, ఎల్2 విజయలక్ష్మి తెలిపారు. మండలంలోని మర్లపాడు గ్రామంలో వ్యవసాయాధికారి స్వర్ణలత కౌలుకు తీసుకున్న ఎకరం పొలంలో ప్రకృతి వ్యవయసాయ సిబ్బంది ఆధ్వర్యంలో పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. రైతులకు సాగులో మెళకువలు, ఉత్తమ యాజమాన్య పద్ధతులు, సమగ్ర సస్యరక్షణ చర్యలు, విత్తనశుద్ధి, మిత్ర పురుగుల సంరక్షణ, శత్రు పురుగుల నిర్మూలన, అధిక మోతాదులో పురుగు మందుల వాడకం వల్లన కలిగే నష్టాలు, రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అందే సేవల గురించి అవగాహన కల్పించారు. అనంతరం మట్టి నమూనాలు సేకరించడంతోపాటు విత్తనాల మొలక పరీక్ష, నీటి నిల్వ సామర్థ్యంపై ప్రయోగాత్మకంగా రైతులకు తెలియజేశారు. కార్యక్రమంలో ఎల్1 వెంకట్రావు, ఐసీఆర్పీలు సుజాత, మరియమ్మ, శృతి, హరిత, జ్యోత్స్న, రైతులు పాల్గొన్నారు.


రైతులకు సూచనలిస్తున్న ప్రకృతి వ్యవసాయాధికారి పద్మావతి

ఇంటర్మీడియెట్ విద్యార్థులకు అభినందన

మద్దిపూడి: ఇంటర్మీడియెట్ పరీక్ష ఫలితాల్లో ప్రతిభ కనబరిచి స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిపిన విద్యార్థులను ప్రిన్సిపాల్ ఆర్.కోటయ్య సోమవారం ప్రత్యేకంగా అభినందించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం అభినందన సభ ఏర్పాటు చేశారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. జిల్లాలో 30 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండగా, ఉత్తీర్ణత శాతంలో మద్దిపూడి కళాశాల ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు 37 మంది పరీక్ష రాయగా 15 మంది, ద్వితీయ సంవత్సరంలో 36 మందికిగాను 27 మంది ఉత్తీర్ణులయ్యారని వివరించారు. ప్రతి గ్రూపులో మద్దిపూడి కళాశాల ప్రథమ స్థానంలో నిలిచేందుకు కృషి చేసిన అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందిని ప్రిన్సిపాల్ అభిందించారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు.


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ కోటయ్య

ఆర్టీసీ బస్టాండ్ ప్లాట్‌ఫాంల పరిశీలన

సింగరాయకొండ: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో సుమారు రూ.50 లక్షల అంచనా వ్యయంతో అదనంగా నాలుగు ప్లాట్‌ఫాంలు నిర్మిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. అదనపు ప్లాట్‌ఫాంల శ్లాబ్ పనులను సోమవారం ఆయన పరిశీలించారు. అశోక్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. బస్టాండులో ప్రయాణికుల రద్దీకి తగిన వసతులు లేకపోవడంతో ఆర్టీసీ నెల్లూరు జోన్ చైర్‌పర్సన్ డాక్టర్ బత్తుల సుప్రజరెడ్డి ఆర్టీసీ చైర్మన్, రాష్ట్ర అధికారుల దృష్టికి తీసుకెళ్లి నిధుల మంజూరుకు కృషి చేశారన్నారు. ఆర్టీసీ ఇంజినీరింగ్ అధికారులు ఈఈ కె.వెంకటేశ్వరరావు, ఏఈ టి.వెంకటేశ్వర్లు ఉన్నారు.


ఇంజినీర్లతో మాట్లాడుతున్న డాక్టర్ అశోక్‌కుమార్‌రెడ్డి

పోస్టల్ ఖాతాదారులకు న్యాయం చేస్తా

● సీఐ దాచేపల్లి రంగనాథ్

సింగరాయకొండ: పాకల పోస్టుమాస్టర్ స్వాహా చేసిన డబ్బును ఖాతాదారులకు అందేలా న్యాయం చేస్తానని సీఐ దాచేపల్లి రంగనాథ్ పేర్కొన్నారు. సోమవారం రాత్రి తనను కలిసిన ఖాతాదారులతో సీఐ మాట్లాడారు. గత ఏడాది పోస్టుమాస్టర్ బిళ్లా శ్రీనివాసులు ఖాతాదారుల సొమ్ము సుమారు రూ.12 లక్షలు స్వాహా చేయడంతో సస్పెండ్ చేసి, సొమ్ము రికవరీ చేశారన్నారు. కానీ ఏడాది గడుస్తున్నా డబ్బు తమ ఖాతాలకు జమ కాలేదని సీఐకి వివరించారు. దీనిపై స్పందించిన సీఐ కందుకూరు పోస్టాఫీసు అసిస్టెంట్ సూపరింటెండెంట్ శివాజీని పిలిపించి సమస్య పరిష్కరించాలని సూచించారు.

కన్నులపండువగా వీరబ్రహ్మం రథోత్సవం

టంగుటూరు: మండలంలోని జమ్ములపాలెం గ్రామంలో పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి రథోత్సవం సోమవారం కన్నుల పండువగా నిర్వహించారు. ముందుగా స్వామివారికి కళ్యాణం నిర్వహించి, ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు.


జమ్ములపాలెంలో వీరబ్రహ్మేంద్ర స్వామి రథోత్సవం

సెలవుల్లో పిల్లలపై అప్రమత్తంగా ఉండాలి

● సీఐ దాచేపల్లి రంగనాథ్



సింగరాయకొండ: వేసవి సెలవుల్లో విద్యార్థులు నీటి కుంటలు, కాలువలు, చెరువుల్లో ఈతకు వెళ్లకుండా తల్లిదండ్రులు తగిన జాగ్రత్త వహించాలని సీఐ రంగనాథ్ సూచించారు. 10వ తరగతి ఫలితాలు వస్తున్నందున విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికాకుండా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలన్నారు. వేసవిలో రాత్రి పూట ఆరుబయట పడుకునే వారు బంగారం, నగదు జాగ్రత్త చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దూరప్రాంతాలకు వెళ్లేవారు వారి సమాచారాన్ని పోలీసులకు తెలిపినట్లయితే తగిన జాగ్రత్తలు తీసుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు.

చెరువు ప్రధాన తూము రోడ్డుకు మరమ్మతులు

పామూరు: మండలంలోని మోపాడు రిజర్వాయర్ ప్రధాన తూము వద్ద మలుపు రోడ్డు మట్టితో పూర్తిగా నిండిపోయి ప్రమాదకరంగా ఉంది. విషయాన్ని స్థానికులు జెడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్య తీసుకువెళ్లడంతో ఆయన స్పందించి తన సొంత నిధులతో పొక్లెయిన్ ఏర్పాటు చేసి ప్రధాన కాల్వ తూము వద్ద ఎటువంటి ప్రమాదం జరగకుండా రాతి స్తంభాలు ఏర్పాటు చేయించారు. పూడిపోయిన మట్టిని తొలగించి రోడ్డును వెడల్పు చేయించి ఎటువంటి ప్రమాదం చోటుచేసుకోకుండా తగిన మరమ్మతులు చేయించారు.


మరమ్మతులు చేసిన చెరువుకాల్వ రోడ్డు

ఘనంగా మద్దిపూడి పాఠశాల శత వార్షికోత్సవం

మద్దిపూడి: స్థానిక ప్రాథమిక పాఠశాల(జనరల్) స్థాపించి నూరు వసంతాలు పూర్తయిన సందర్భంగా ఆదివారం రాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం లీలావతి మాట్లాడుతూ.. చదువుకున్న పాఠశాలను గుర్తుంచుకుని అభివృద్ధికి సహకరించడంతోపాటు సుదూర ప్రాంతాల నుంచి వేడుకలకు హాజరుకావడం ఆనందంగా ఉందన్నారు. ఆటలపోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో విశ్రాంత హెచ్‌ఎం బీఏల్‌ఎన్ శాస్త్రి సుబ్బారావు, విద్యా కమిటీ చైర్మన్ తాతా రమణయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


సినీ గీతాలకు నృత్యం చిందేస్తున్న విద్యార్థులు

ఘనంగా వైవీ సుబ్బారెడ్డి జన్మదిన వేడుకలు


కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

కనిగిరి రూరల్: టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి జన్మదిన వేడుకలను సోమవారం కనిగిరిలో ఘనంగా నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దంతులూరి ప్రకాశం, జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి వైవీ సుబ్బారెడ్డి జన్మదిన వేడుకల కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంపాడు పార్టీ మండల కన్వీనర్ యక్కంటి శ్రీనివాసులరెడ్డి, పిల్లి లక్ష్మీనారాయణరెడ్డి, శ్రీహరిరెడ్డి, వైస్ ఎంపీపీ లక్కిరెడ్డి తిరుపతిరెడ్డి, సర్పంచ్ గోవిందరెడ్డి, పార్టీ ప్రజాప్రతినిధులు నాయకులు, పాల్గొన్నారు.

కనిగిరి కేంద్రంలో డయాలసిస్ సేవలు ప్రారంభం


డయాలసిస్ చేయించుకుంటున్న కిడ్నీ బాధితులు

కనిగిరి రూరల్: ప్రభుత్వ ఆస్పత్రిలోని డయాలసిస్ కేంద్రంలో సోమవారం నుంచి సేవలు అందుతున్నట్లు కేంద్రం మేనేజర్ కె.బాబి ప్రీస్ తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 11.30 గంటల వరకు 17 మిషన్ల ద్వారా 53 మంది కిడ్నీ పేషంట్లకు డయాలసిస్ చేసినట్లు వివరించారు. మంగళవారం నుంచి పూర్తిస్థాయిలో అన్ని మిషన్లతో కిడ్నీ బాధితులకు కనిగిరి కేంద్రంలోనే డయాలసిస్ చేస్తామని వెల్లడించారు. విద్యుత్ అధికారులతో మాట్లాడి డయాలసిస్ సేవలు అందుబాటులోకి వచ్చేలా తక్షణం స్పందించి చర్యలు తీసుకున్న ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్‌కు, ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

5న ఉచిత సున్తీ

కనిగిరి రూరల్: కేఎస్‌ఎం ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఈనెల 5న ఉచిత సున్తీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు సొసైటీ అధ్యక్షుడు, మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. పట్టణంలోని 13వ వార్డులో, ముస్లిం ప్రాంతాల్లో, మద్రాసాల్లో ఉచిత సున్తీ కార్యక్రమంపై సోమవారం కరపత్ర ప్రచారం చేశారు. 5న శుక్రవారం ఉదయం 7గంటలకు స్థానిక ఎన్జీఓ హోం ప్రాంగణంలో ఉచిత సున్తీ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఆసక్తి కల్గిన వారి పిల్లల పేర్లను ఎన్జీవో హోం నందు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సయ్యద్ రిజ్వాన ఖాలక్, ముఫ్తి అబ్దుల్ కలాం, మౌలానా మహ్మద్ అలీ, గృహ సారథులు సయ్యద్ నాయబా, మన్సూర్, ఎస్‌డీ నూర్, మాజీ వార్డు సభ్యులు సయ్యద్ నాయబ్ రసూల్, ముస్లిం నాయకులు పాల్గొన్నారు.